క్లుప్తంగా

రోడ్డు ప్రమాదాలను నివారిస్తాం

జోగిపేట(అందోల్): రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గురువారం అందోల్ జోగిపేట ఆర్డీఓ పాండు, ఆర్అండ్‌బీ ఈఈ రాంబాబు, జోగిపేట సీఐ నాగరాజు, మున్సిపల్ కమిషనర్ తిరుపతి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలోని అల్మాయిపేట నుంచి జోగిపేట మున్సిపల్ కేంద్రం ప్రధాన రోడ్డు గుండా ఉన్న 161 నేషనల్ హైవే రోడ్డుపై ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. అదేవిధంగా జోగిపేట మున్సిపల్ కేంద్రంలో ఉన్న డివైడర్‌కు అక్కడక్కడ దారులు విడిచిపెట్టడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఫైర్‌స్టేషన్ వద్ద బందావన్ కాలనీలోకి వెళ్లేందుకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. దీంతో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అంబేడ్కర్ ఫోటో ఏర్పాటు చేయండి


మాట్లాడుతున్న నర్సింహులు

నారాయణఖేడ్: రిపబ్లిక్‌డే వేడుకల్లో విధిగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి రాజ్యాంగ పీఠికపై ప్రతిజ్ఞ చేయించాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొటారి నర్సింహులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఖేడ్ పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ అంబేడ్కర్ ఫోటో ఏర్పాటు, తదితర అంశాలపై కలెక్టర్లకు జీవో ద్వారా ఆదేశాలు జారీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆయన వెంట ఆ సంఘం జిల్లా, స్థానిక నాయకులు దాస్, మశ్చందర్, జ్ఞానేష్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


కల్లుగీత కార్మిక సంఘం క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న సీఐ మహేష్, నాయకులు

నారాయణఖేడ్: ఖేడ్ ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం ఆవరణలో కల్లుగీత కార్మిక సంఘం 2024 క్యాలెండర్లను ఎక్సైజ్ సీఐ మహేష్ సంఘం నాయకులతో కలిసి గురువారం ఆవిష్కరించారు. అనంతరం సంఘం నాయకులు, సభ్యులకు వాటిని అందజేశారు. ఎక్సైజ్ ఎస్ఐలు రవి, సురేందర్ బెనర్జీ, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అంజాగౌడ్, స్థానిక బాధ్యులు రాంచందర్‌గౌడ్, నర్సింహగౌడ్, బాలాగౌడ్, విఠల్‌దాస్‌గౌడ్, రాజాగౌడ్, సీఐటీయూ నాయకులు చిరంజీవి, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

యూనిఫాం పంపిణీ


విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేస్తున్న బ్యాంక్ అధికారులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని శ్రీమాణిక్ ప్రభు స్కూల్‌లోని అంగవైకల్యం కలిగిన విద్యార్థులకు పట్టణంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా అధికారులు గురువారం ఉచితంగా యూనిఫాంలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ సంతోష్ మాట్లాడుతూ సామాజిక సేవలో భాగంగా వికలాంగ విద్యార్థులకు యూనిఫాంలు అందజేయడం ఆనందంగా ఉందన్నారు. అంగవైకల్యం ఉన్న విద్యార్థులను ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటయ్య పాల్గొన్నారు.

భవానీ మాత ఆలయంలో యజ్ఞం

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని హోతి(కె)లోని భవానీ మాత ఆలయంలో లోక కల్యాణార్థం గురువారం యజ్ఞం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కుడండల్ అయిమాత ఆధ్వర్యంలో శ్రీమంత్ పూజారి, జగదాంబ దంపతుల పర్యవేక్షణలో వేణుభట్ మహారాజ్ యజ్ఞం, ప్రత్యేక పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం, తెలంగాణ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు గడ్డం జనార్దన్, శివాజీపాటిల్, పద్మా రమేష్‌బాబు, రాజ్ కుమార్ దేశ్ పాండే, తాండూరు హరి, సగ్గం శ్రీనివాస్, అప్పం ప్రభు, రమేష్, మాణిక్యం, డాక్టర్ అంబదాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది ఓటు

జిల్లావ్యాప్తంగా జాతీయ ఓటరు దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు ఓటుహక్కు ప్రాముఖ్యతను వివరించారు. పలుచోట్ల అవగాహన ర్యాలీలు నిర్వహించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ 18 ఏళ్లు నిండినవారు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు.


జోగిపేటలో ప్రతిజ్ఞ చేస్తున్న అందోల్ జోగిపేట ఆర్డీఓ పాండు, అధికారులు


జిన్నారం: విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి


రాయికోడ్: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు


జహీరాబాద్ టౌన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందచేస్తున్న అధికారులు


నారాయణఖేడ్: ఓటుహక్కుపై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఆర్డీఓ వెంకటేష్


సంగారెడ్డి: నవయువ సమ్మేళనంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి


కల్హేర్: ప్రతిజ్ఞ చేస్తున్న తహసీల్దార్ బాలశంకర్, అధికారులు, సిబ్బంది


మునిపల్లి: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు


కంగ్టిలో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు, అధికారులు


పటాన్‌చెరు టౌన్: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగులు, అధికారులు

సమష్టి సహకారంతోనే అభివృద్ధి

- ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం
- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి


గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: సమష్టి సహకారంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని రుద్రారం గ్రామంలో రూ.1.76 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం, మహిళా సమాఖ్య భవనం, అంబేడ్కర్ యువజన సంఘం, బుడగ జంగాల సంక్షేమ సంఘం భవనాలను ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పటాన్‌చెరు నియోజకవర్గం వ్యాప్తంగా ప్రభుత్వం అందించే నిధులతో పాటు పరిశ్రమల సహకారంతో గ్రామ పంచాయతీల భవనాలతో పాటు అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. త్వరలో రుద్రారంలో లాటిక్రేట్ సంస్థ సౌజన్యంతో రూ.10 కోట్ల అంచనా వ్యయంతో ఆధునిక వసతులతో జెడ్పీ ఉన్నత పాఠశాల భవనాన్ని నిర్మించనున్నట్లు చెప్పారు. పదేండ్ల కాలంలో నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధికి ఆదర్శంగా తీర్చిదిద్దామని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుష్మాశ్రీ, జెడ్పీటీసీ సుప్రజ, సర్పంచ్ సుధీర్‌రెడ్డి, ఎంపీటీసీలు మన్నె రాజు, హరిప్రసాద్‌రెడ్డి, ఎంపీడీవో బన్సీలాల్, పంచాయతీరాజ్ డీఈ సురేష్, డీఎల్‌పీఓ సతీష్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాండు, సీనియర్ నాయకులు దశరథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, గ్రామ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మోతి మాత ఆలయ అభివృద్ధికి కృషి

ఎంపీ బీబీ పాటిల్


మాట్లాడుతున్న ఎంపీ బీబీ పాటిల్

జహీరాబాద్: పట్టణంలోని మోతిమాత ఆలయ అభివృద్ధికి రూ.10లక్షల నిధులను కేటాయించనున్నట్లు జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ ప్రకటించారు. గురువారం మొగుడంపల్లి మండలం ఉప్పర్‌పల్లితండాలో మోతిమాత జాతరకు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆలయ కమిటీ చైర్మన్ రామ్‌శెట్టి, బీఎస్ఎన్ఎల్ సభ్యుడు శంకర్‌నాయక్‌లు ఆలయాభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరగా సానుకూలంగా స్పందించారు. తమ ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి హరీశ్‌రావు సహకారంతో ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశామని గుర్తు చేశారు. భవిష్యత్తులోనూ ఆలయ అభివృద్ధికి పాటుపడతామని హామీనిచ్చారు. ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నరోత్తం, ఐడీసీ మాజీ చైర్మన్ తన్వీర్, బీఆర్ఎస్ నాయకులు నారాయణ, నరేష్, గోవర్ధన్‌రెడ్డి, ఆనంద్, శంకర్ నాయక్, గోపాల్, హబ్సిరాజు, రాములు నేత, మోతిరాం, విజేందర్‌రెడ్డి, జగదీష్, హీరూ రాథోడ్, చందుజాదవ్, కేషుసింగ్, ధీరు, రూప్‌సింగ్, చందర్, శ్రీనివాస్, సంజు, వసు, మహేష్, నరేష్, గోవింద్, విజయ్, సికిందర్ పాల్గొన్నారు.

హెచ్ఐవీపై కళాప్రదర్శన

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని గుండ్లమాచునూర్ గ్రామంలో గురువారం హెచ్ఐవీ (ఎయిడ్స్)పై ప్రజలకు కళారూపాలతో అవగాహన కల్పించారు. స్కోప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శృతి కళాబృందం కళాకారులు పాటలతో అవగాహన కల్పించారు. హెచ్ఐవీపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి రమణారెడ్డి, స్కోప్ స్వచ్ఛంద సంస్థ లింక్ వర్కర్ జ్యోతి, కళాకారులు శేఖర్ చారి, భిక్షపతి, భూమయ్య, మురళి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించండి

జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఉజ్వల్‌రెడ్డి


టోర్నమెంట్ వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉజ్వల్‌రెడ్డి, నాయకులు

జహీరాబాద్: గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రతిఒక్కరూ ప్రోత్సహించాలని జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఉజ్వల్‌రెడ్డి తెలిపారు. జహీరాబాద్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో క్రికెట్ టోర్నమెంట్ వివరాలను వెల్లడించారు. ఈ నెల 26వ తేదీ నుంచి మండల స్థాయిలో అన్ని గ్రామాలకు చెందిన క్రీడాకారులు పాల్గొనేందుకు వీలుగా క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. ఫిబ్రవరి 10వరకు పోటీలను నిర్వహిస్తామన్నారు. 26న న్యాల్‌కల్ మండలం, 28న జహీరాబాద్ పట్టణం, ఝరాసంగం, జహీరాబాద్ రూరల్ స్థాయిలో పోటీలు జరుగుతాయని తెలిపారు. 29న కోహీర్, మొగుడంపల్లి మండలాల్లో నిర్వహిస్తామని తెలిపారు. మండల స్థాయిలో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి నగదు పారితోషికం కింద రూ.51వేలు, రన్నర్‌కు రూ.31వేలు అందించనున్నట్లు తెలిపారు. మండల స్థాయి పోటీల్లో గెలుపొందిన జట్లకు తాలూకా స్థాయిలో జహీరాబాద్‌లోని బాగారెడ్డి స్టేడియం గ్రౌండ్‌లో క్రీడాపోటీలను నిర్వహిస్తామన్నారు. ఇందులో గెలుపొందిన జట్టుకు రూ.2లక్షల నగదు, రన్నర్ జట్టుకు రూ.లక్ష నగదు పారితోషికం అందజేస్తామని వివరించారు. ఈ నెల 26న గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరంగా ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ నారాయణరెడ్డి, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శుక్లవర్ధన్‌రెడ్డి, భాస్కర్, గోపాల్, శేఖర్, అతార్ అహ్మద్, తిరుపతి రెడ్డి, జగదీష్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శివదీక్షలు

ఝరాసంగం(జహీరాబాద్): మహాశివరాత్రిని పురస్కరించుకుని దక్షిణకాశిగా ప్రసిద్ధి చెందిన కేతకి సంగమేశ్వర ఆలయానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. ముందుగా ఆలయ ఆవరణలోని అమృత గుండంలో పవిత్ర పుణ్యస్నానాలు ఆచరించి, జలలింగానికి పూజలు చేశారు. గర్భగుడిలోని పార్వతిపరమేశ్వరులన దర్శించుకుని శివదీక్షలు చేపట్టారు.

హత్నూర(సంగారెడ్డి): శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జునస్వామి శివదీక్షలను హత్నూరలోని శివాలయంలో ఆంజనేయులు గురుస్వామి ఆధ్వర్యంలో గురువారం మాలధారణలు వేసుకున్నారు. మండలంలోని దౌల్తాబాద్, నవాబుపేట, కొన్యాల, వడ్డేపల్లి, షాదుల్లానగర్, మధుర, కాసాల, గ్రామాలతో పాటు మెదక్ జిల్లా చిలిపిచేడ్, జగ్గంపేట, ఫైజాబాద్ గ్రామాలకు చెందిన శివదీక్ష మాలశివ స్వాములు హత్నూర శివాలయంలో మాలలు స్వీకరించారు. 41 రోజుల పాటు శివదీక్షను స్వీకరించి పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు నిరసన ర్యాలీ

హత్నూర(సంగారెడ్డి): కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా సంగారెడ్డిలో ఈ నెల 26న నిర్వహించే వాహనాల నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయిని ప్రసాద్ పిలుపునిచ్చారు. హత్నూర మండల పరిధిలోని దౌల్తాబాద్ ఆటో స్టాండ్ వద్ద కేంద్రప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజావ్యతిరేక విధానాలపై కరపత్రం విడుదల చేశారు. అనంతరం బోయిని ప్రసాద్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ ఆదానీ అంబానీల చేతుల్లో కీలుబొమ్మగా మారి ప్రజలను, రైతులను కార్మికులను శ్రమ దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. వచ్చే నెల ఫిబ్రవరి16న కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సత్తయ్య, యాదయ్య, గంగమ్మ, దుర్గయ్య, లక్ష్మయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

నారాయణఖేడ్: హైదరాబాద్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆవరణలో హైకోర్టుకు స్థలాన్ని కేటాయించే జీవోను రద్దు చేయాలని శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులపై పోలీసులు దాడి చేయడం సరి కాదని ఆ సంఘం నగర కార్యదర్శి అనిల్ అన్నారు. పోలీసుల తీరును నిరసిస్తూ గురువారం నారాయణఖేడ్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ తమ నాయకులను వెంబడించి కొట్టడమే కాకుండా సంఘం రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీని జుట్టు పట్టుకొని కొట్టారని మండిపడ్డారు. ఈ ఘటనపై పోలీసు ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఇష్టానుసారంగా వ్యవహరించిన పోలీసులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు రాజు, ముస్తఫ తదితరులు పాల్గొన్నారు.





గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం



పోలీసు శాఖ లోగో ముందు సిబ్బంది

గణతంత్ర వేడుకలను పురస్కరించుకొని సంగారెడ్డి పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది ఇండియా మ్యాప్, పోలీస్ లోగో, పాలపిట్ట ముగ్గులు వేసి మైదానమంతా రంగులమయం చేశారు. ప్రభుత్వ పథకాలు వివరించేందుకు వీలుగా ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేశారు. నేడు ఉదయం 9గంటలకు కలెక్టర్ వల్లూరు క్రాంతి జాతీయజెండా ఎగురవేయనున్నారు.

– సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి

చాప్టా(కె) సర్పంచ్ సంగమ్మ సస్పెండ్

నారాయణఖేడ్: ఖేడ్ మండలం చాప్టా(కె) సర్పంచ్ పార్శెట్టి సంగమ్మను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. చాప్టా(కె) సర్పంచ్‌గా కొనసాగుతున్న పార్శెట్టి సంగమ్మ కుమారుడు విజయ్‌కుమార్ ఇటీవల గ్రామ పంచాయతీకి చెందిన ఎస్‌బీఎం నిధులు ఫోర్జరీ సంతకాలతో రూ.6,7,500లను డ్రా చేసినట్లు పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు చేయడంతో ఇటీవల ఆయనపై నారాయణఖేడ్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. దీంతో ఈ విషయమై విచారణ జరిపించాలని టీపీసీసీ సభ్యులైన కర్నె శ్రీనివాస్ ఫిర్యాదు చేయడంతో డివిజనల్ పంచాయతీ అధికారి విచారణ జరపడంతో సర్పంచ్ కుమారుడి ప్రమేయం ఉన్నట్లు గుర్తించారు. అంతేకాకుండా నిధులను గత నెల 14 నుంచి ఈనెల 17వరకు ఆరుసార్లు విడతల వారీగా డ్రా చేసినట్లు విచారణలో తేలింది. ఆ నివేదికను డివిజనల్ పంచాయతీ అధికారి కలెక్టర్‌కు అందజేయడంతో సర్పంచ్‌ను ఆరునెలల పాటు సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. చాప్టా(కె) ఇన్‌చార్జి సర్పంచ్‌గా ఉపసర్పంచ్ గంగయ్యస్వామిని గ్రామ పంచాయతీ చెక్‌పవర్‌ను ఎంపీడీవో జాయింట్ సంతకంతో కొనసాగించాలని కలెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సర్పంచ్ సస్పెన్షన్, ఉప సర్పంచ్‌కు ఇన్‌చార్జిగా నియమించిన విషయాన్ని ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డి ధ్రువీకరించారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి


విరాహత్ అలీని సన్మానిస్తున్న జర్నలిస్టులు

సంగారెడ్డి టౌన్: జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు (టీయూడబ్ల్యూజేఐజేయూ) రాష్ట్ర శాఖ అధ్యక్షుడు విరాహత్ అలీ అన్నారు. సంగారెడ్డి జిల్లా శాఖ పక్షాన జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి ఆధ్వర్యంలో రాష్ట్ర శాఖ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన విరాహత్ అలీ గురువారం హైదరాబాద్‌లోని యూనియన్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు మాట్లాడుతూ సాధారణ జర్నలిస్టుగా ప్రస్థానం మొదలై రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన విరహత్ అలీ నాయకత్వంలో జర్నలిస్టులకు మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఫైజల్, జాతీయ కౌన్సిల్ సభ్యుడు మురళీధర్ శర్మ, సీనియర్ నాయకుడు పానుగంటి కృష్ణ, పటాన్‌చెరు ప్రాంత నాయకుడు నరసింహ పాల్గొన్నారు.

గ్రామ అవసరాలకు భూమిని కేటాయించండి

జెడ్పీ వైస్‌చైర్మన్ ప్రభాకర్


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, రైతులు

జిన్నారం(పటాన్‌చెరు): పరిశ్రమల ఏర్పాటుకు గ్రామస్తులు వారి భూములను ఇచ్చారని, దీంతో గ్రామ అవసరాలకు రెండెకరాల భూమిని కేటాయించాలని జెడ్పీ వైస్‌చైర్మన్ ప్రభాకర్ కలెక్టర్‌కు కోరారు. ఈ మేరకు కలెక్టర్ క్రాంతికి గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ జిన్నారం మండలంలోని శివానగర్ గ్రామ రైతులు 130 ఎకరాల భూమిని టీఎస్ ఐపాస్‌కు ఇచ్చారన్నారు. అప్పట్లో 8ఎకరాలను గ్రామ అవసరాలకు కేటాయించారని గుర్తుచేశారు. మరో రెండెకరాల భూమిని కేటాయించి గ్రామపంచాయతీ పేరిట రిజిస్ట్రేషన్ చేయించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరామన్నారు. ఇందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. సర్పంచ్ రేఖ, ఎంపీటీసీ సంతోష, నాయకులు మహేష్, కృష్ణ, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.